సాక్షి
ఖమ్మం
శనివారం । 26 । జూలై । 2025



ఎందుకనో వెనుకబడ్డాయి..

ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో వెనుకబడ్డాయి. 8లో



యుద్ధప్రాతిపదికన పనులు

గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంపై 'సాక్షి'లో కథనం రావడంతో ఉద్యోగులు ఉదయం నుంచే చెత్త తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం

జిల్లా అంతటా శనివారం వర్షం కురిసే సూచనలు ఉన్నాయి. చాలా చోట్ల ఓ మోస్తరుకు మించి వర్షపాతం నమోదవుతుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శని, ఆదివారం ఖమ్మంలో పర్యటించనున్నారు. శనివారం సాయంత్రం 5గంటలకు ఖమ్మం 3వ డివిజన్ అరుణాచల్‌నగర్ రోడ్డులో అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. అలాగే, బల్లేపల్లి, రెయిన్‌బో నగర్ ఎస్సీ కాలనీల్లో రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇక ఆదివారం ఉదయం 9గంటలకు ఖమ్మం 9వ డివిజన్ రోటరీనగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మానానికి శంకుస్థాపన చేయనున్నారు.

31వరకు 'దోస్త్' స్పెషల్ ఫేస్ అడ్మిషన్లు

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ద్వారా డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా, దోస్త్ కోఆర్డినేటర్ ఎం.డీ.సలీంపాషా తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 31వరకు దరఖాస్తు చేసుకుని వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నా సీటు రాని వారు, గత మూడు విడతల్లో దరఖాస్తు చేయని వారికి సైతం అవకాశముందని తెలిపారు. పూర్తి వివరాల కోసం కళాశాలలోని హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

'ఓపెన్' పరీక్షలకు పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ సత్యనారాయణ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సూచించారు. పదో తరగతి ఒక్కో థియరీ, ప్రాక్టికల్ సబ్జెక్టులకు రూ.100 చొప్పున, ఇంటర్ అభ్యర్థులు రూ.150 చొప్పున ఈనెల 28నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. అలాగే, ఒక్కో సబ్జెక్టుకు రూ.25 జరిమానాతో ఆగస్టు 6నుంచి 10వరకు, రూ.50 జరిమానాతో ఆగస్టు 11నుంచి 15వ తేదీ వరకు చెల్లించవచ్చని వెల్లడించారు. ఇక తత్కాల్ పద్ధతిలో పదో తరగతికి రూ.500, ఇంటర్ అభ్యర్థులు రూ.1,000 జరిమానాతో ఆగస్టు 16నుంచి 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశముందని తెలిపారు. అభ్యర్థులు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో లేదా మీ సేవ, టీ సేవ కేంద్రాల ద్వారా ఫీజు చెల్లించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సురేంద్రమోహన్



సురేంద్రమోహన్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాల వారీగా సీనియర్ ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది. గతంలో వీరిని నియమించినా కొన్ని మార్పులు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సురేంద్రమోహన్‌ను నియమించారు. ఆయన గతంలో ఖమ్మం జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించడమే కాక కొన్నాళ్ల పాటు ప్రత్యేక అధికారిగా కూడా వ్యవహరించారు.

కరుణించి.. వర్షించి

గత నెలలో ముఖం చాటేసిన నైరుతి రుతుపవనాలు ఈనెలలో కరుణించాయి. ఎండలు, పొడి వాతావరణంతో పత్తి విత్తనాలు నేలలోనే మాడిపోగా ఓ దశలో కరువుఛాయలు అలుముకున్నాయి. ఇంతలోనే వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరిలూదగా.. వానాకాలం పంటల సాగుకు ఢోకా లేనట్లేనని రైతులు భావిస్తున్నారు. జిల్లా అంతటా నైరుతి ప్రభావంతో వర్షం కురుస్తోంది. అయితే, రుతుపవనాలు ప్రవేశించిన జూన్‌లో లోటు వర్షపాతం నమోదు కాగా, ఈనెల ఇప్పటికే సాధారణాన్ని మించి వర్షపాతం నమోదు కావడం విశేషం.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం



నేలకొండపల్లి సమీపాన వరినాట్లు వేస్తున్న కూలీలు

➔ ఆ మండలాల్లో..

ఈనెల జిల్లాలోని కూసుమంచి, ఖమ్మం రూరల్, కొణిజర్ల, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, మధిర మండలాల్లో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. మిగతా 14 మండలాల్లో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే ఉంది. అయితే, ఈనెలాఖరు నాటికి ఈ మండలాల్లోనూ పరిస్థితులు మారే అవకాశం కనిపిస్తోంది. గత నెలలో కేవలం ఏడు రోజులే వర్షం పడితే ఈ నెలలో ఇప్పటికి 13రోజులు వర్షం కురిసింది. రెండు నెలల్లో అన్ని మండలాల్లో కలిపి 32.7 సెం.మీ. సగటుకు గాను 38.2సెం.మీ. వర్షపాతం నమోదైంది.

గత నెలలో 5.6 శాతం లోటు వర్షపాతం

- ఈ నెలలో మాత్రం సాధారణానికి మించి నమోదు
- ఏడు మండలాల్లో అత్యధికంగా వాన
- జిల్లా అంతటా నైరుతి రుతుపవనాల ప్రభావం

సగటున 25.8 సెంటీమీటర్లు..

జిల్లాలో ఈనెల చివరి వరకు సాధారణ సగటు వర్షపాతం 24.9 సెం.మీ. కాగా ఈనెల 25వరకే 25.8 సెం.మీ.గా నమోదైంది. ఇంకా రెండు, మూడు రోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యాన గత ఏడాది జూలై కన్నా ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. జూన్ సాధారణ సగటు వర్షపాతం 13.1 సెం.మీ.కు గాను 12.3 సెం.మీ. వర్షపాతమే నమోదు కాగా 5.6శాతం లోటుగా ఏర్పడింది. గత ఏడాది జూన్‌లో మాత్రం సాధారణ వర్షపాతాన్ని మించి 58.7 శాతం అదనంగా వర్షం కురిసింది. అయితే, ఈ ఏడాది జూన్‌లో లోటు ఏర్పడినా... రెండు నెలల వర్షపాతాన్ని లెక్కిస్తే 16.7 శాతం ఎక్కువగా నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

ఈ నాలుగు నెలలే కీలకం..

వర్షాన్ని నేల ఒడిసిపట్టేందుకు జూన్ నుంచి సెప్టెంబర్ నెలలే కీలకం. వానాకాలం, యాసంగి పంటల సాగుకు ఈ నాలుగు నెలల్లో పడే వర్షమే ఆధారమవుతుంది. చెరువులు, కుంటలు నిండి, వాగులు, వంకలు పొంగి పొర్లితే నేలంతా చిత్తడిగా మారి వాతావరణంలో తేమ పెరుగుతుంది. తద్వారా ఇటు మెట్ట పంటలు, అటు తరి పంటల సాగుకు కలిసొస్తుంది. నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీటి విడుదల, ఆ తర్వాత వర్షాధారంగా నీటి ఆవాసాలు నిండిన నేపథ్యాన.. వానాకాలంతో పాటు యాసంగి సాగుకు కూడా ఢోకా ఉండదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో గత ఏడాది సగటు వర్షపాతం వివరాలు (సెం.మీ.ల్లో)

నెల	సాధారణ	నమోదు	అదనం/ లోటు (శాతం)
జూన్	12.4	19.7	+ 58.7
జూలై	24.9	30.3	+ 21.5
ఆగస్టు	24.9	28.6	+ 15.1
సెప్టెంబర్	18.3	40.2	+ 119.2
ఈ ఏడాది..			
జూన్	13.1	12.3	- 5.6
జూలై	19.6	25.8	+ 31.6

వెంటాడుతున్న గత అనుభవాలు

గత ఏడాది జిల్లాలో కుండపోతగా వర్షం పడింది. ఎడతెరిపి లేని వాన, వరదలతో జిల్లా వణికింది. మేఘాలకు చిల్లు పడిందా అన్నట్లుగా ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు జిల్లాను అతలాకుతలం చేశాయి. ఆగస్టులో 15శాతం అదనంగా వర్షం పడితే, సెప్టెంబర్‌లో సాధారణానికి మించి 119.2 శాతం వర్షపాతం నమోదు కావడం గమనార్హం. గత ఏడాది జూన్, జూలైలో సాధారణ వర్షపాతం దాటకపోగా, ఆ తర్వాత రెండు నెలల్లో పడిన వర్షాలతో జిల్లా వరదమయమైంది. ప్రస్తుతం వారం రోజులుగా వర్షం కురుస్తుండడం.. మరో రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందనే సమాచారంతో ఈ ఏడాది కూడా గతంలో మాదిరి వర్షపాతం నమోదవుతుందా అన్న చర్చ మొదలైంది.

ట్రయల్‌రన్ విజయవంతం

'మంచుకొండ' నుంచి మూడు మోటార్ల ద్వారా నీటి ఎత్తిపోత



డెలివరీ పాయింట్‌లోకి చేరుతున్న సాగర్ జలాలు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల రైతుల సాగునీటి అవసరాలకు సాగర్ జలాలు అందించేలా రూ.66 కోట్ల వ్యయంతో నిర్మించిన మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులు చివరి దశకు చేరాయి. ఈమేరకు శుక్రవారం మూడు మోటార్ల ట్రయల్ రన్ నిర్వహించగా విజయవంతమైంది. ఈ మోటార్ల ద్వారా పంప్ హౌస్ నుంచి 38.59 క్యూసెక్కుల నీరు డెలివరీ చేరడం విశేషం. గత వేసవిలోనే తాత్కాలికంగా ఒక మోటార్ అమర్చి ట్రయల్ రన్ చేపట్టారు. ఆతర్వాత మూడు మోటార్లు చేరడంతో త్వరగా అమర్చి మండలంలోని చెరువులకు సాగర్ జలాలు చేర్చాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ఆదేశించారు. దీంతో అధికారులు మూడు రోజులుగా మిగులు పనులను పూర్తిచేసి ట్రయల్‌రన్ చేపట్టగా విజయవంతమైంది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారుడు పెంటారెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ ఝాన్సీ, ఏఈలు రాజీవ్‌గాంధీ, శ్రీరాంచరణ్ పాల్గొనగా ఒక్కో మోటార్ ఆన్ చేస్తూ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.

తొలుత 27.. ఇప్పుడు 36 చెరువులు

రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వపై ఎత్తిపోతల పథకం నిర్మించి మండలంలోని చెరువులకు సాగర్ జలాలు చేర్చేలా ఈ పథకానికి రూపకల్పన చేశారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం పేరిట ఈ పథకాన్ని నిర్మించగా తొలుత 27 చెరువులకు నీరు అందించేలా ప్రణాళికలో పొందుపరిచారు. కానీ రైతుల డిమాండ్ మేరకు దశలవారీగా మొత్తం 36 చెరువులకు నీరు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈమేరకు తొమ్మిది కి.మీ. ప్రధాన పైపులైన్, 25 కి.మీ. ఫీల్డ్ పైపులైన్ పనులు పూర్తికాగా, త్వరలోనే సాగునీటి సరఫరా ప్రారంభమయ్యే అవకాశముంది.

ఆన్‌లైన్‌లో వేగం పెంచాలి



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కారేపల్లి/కామేపల్లి: భూభారతి సదస్సుల ద్వారా అందిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. సింగరేణి, కామేపల్లి తహసీల్దార్ కార్యాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్‌లో నమోదుపై ఉద్యోగులకు సూచనలు చేశారు. అలాగే, విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్లను నిర్ణీత వ్యవధిలో జారీచేయాలని తెలిపారు. తహసీల్దార్లు అనంతుల రమేష్, సుధాకర్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

నెలంతా రెండు ప్రసవాలేనా?

- నేలకొండపల్లిలో వైద్యసేవలపై కలెక్టర్ అసంతృప్తి
- సీహెచ్‌సీ ప్రాంగణం నుంచి పీహెచ్‌సీని మార్చాలని ఆదేశం



చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

నేలకొండపల్లి: నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో అందుతున్న వైద్యంపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమైన కలెక్టర్ ఈ నెలలో కేవలం రెండు ప్రసవాలే జరగడం ఏమిటని ప్రశ్నించారు. సరిపడా వైద్యులు, సిబ్బంది, సౌకర్యాలు ఉన్నా గర్భిణులకు అవగాహన కల్పించకపోవడం, రక్తకణాల పరీక్షల నిర్వహణలో లోపాలను తప్పుపట్టారు. ఆస్పత్రిలో 50 మంది వైద్యులు, సిబ్బందికి 33 మందే ఆన్‌లైన్ హాజరు నమోదు చేసుకోవడంపై ప్రశ్నించిన కలెక్టర్ ఇకపై అందరూ హాజరు వేయాలని ఆదేశించారు. అలాగే, ఇద్దరు వైద్యులు సెలవులో ఉన్నారని తెలుసుకున్న కలెక్టర్ జ్వరాల సీజన్‌లో సెలవులు ఎలా ఇస్తున్నారని డిప్యూటీ డీఎంహెచ్ఓను ఫోన్‌లో వివరణ అడిగారు. కాగా, హోమియో వైద్యాధికారికి హైదరాబాద్‌లో డిప్యూటేషన్ ఇవ్వడం సరికాదని వెంటనే రప్పించాలని సూచించారు. అంతేకాక సీహెచ్‌సీ, పీహెచ్‌సీ కలిసి ఉన్నందున ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు పీహెచ్‌సీని మరోచోటకు మార్చాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, వైద్యాధికారి కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రీల్స్ చూస్తే సమయం వృథా

జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలన్నది ఎవరికి వారే నిర్ణయించుకోవాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. నేలకొండపల్లి జూనియర్ కాలేజీను తనిఖీ చేసిన విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్ పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ఇతర ప్రవేశపరీక్షలకు కూడా సిద్ధం కావాలని తెలిపారు. అలాగే, విలువైన సమయాన్ని రీల్స్ చూస్తూ వృథా చేసుకోవద్దని చెప్పారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు తదితరలు పాల్గొన్నారు.

జ్వరం కేసులన్నీ పర్యవేక్షించాలి

- డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వే
- అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ, పక్కన జెడ్పీ సీఈఓ దీక్ష, డీఎంహెచ్ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో జ్వరంతో బాధపడుతున్న వారి విషయంలో వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు పారిశుద్ధ్య నిర్వహణ కీలకమైనందున మండలంలో వైద్యాధికారి, ఎంపీడీఓ, ఎంపీఓ సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు ఉంటే నిర్ధారణ పరీక్షలు చేయించాలని చెప్పారు. ఎవరైనా డెంగీ బారిన పడితే ఆ ప్రాంతంలో ఫీవర్ సర్వే చేయడమే కాక 150 ఇళ్ల వరకు ఫాగింగ్ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అలాగే, డెంగీ కేసుల వివరాల నమోదు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి క్లోరినేషన్, గురుకులాల్లో విద్యార్థులకు వైద్యపరీక్షలపై ఆమె సూచనలు చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఎంహెచ్ఓ కళావతిబాయి, డీపీఓ ఆశాలత, డీసీహెచ్ఎస్ రాజశేఖర్, డిప్యూటీ సీఈఓ నాగపద్మజ తదితరులు పాల్గొన్నారు.


తల్లాడలో అదనపు కలెక్టర్ విచారణ

తల్లాడ: తల్లాడ పీహెచ్‌సీ సమీపాన నివాసముండే కందుల శ్రీదేవి మృతి చెందగా, అందుకు కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. శ్రీదేవి డెంగీతో మృతి చెందినట్లు ప్రచారం జరగగా అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎంహెచ్ఓ కళావతిబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి రత్న మనోహర్, మృతురాలి బంధువుల నుంచివివరాలు సేకరించారు. చికిత్సపై ఆరా తీయడమే కాక శ్రీదేవి బంధువులు సైతం జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అయితే, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించగా ఆమె డెంగీతో మృతి చెందినట్లు చెప్పారే తప్ప రిపోర్టుల్లో లేదని తేలింది. కాగా, తల్లాడలో పారిశుద్ధ్య పనులను డీపీఓ ఆశాలత తనిఖీ చేశారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, ఈఓ కృష్ణారావు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అప్రమత్తత

వైరా: వైరా రిజర్వాయర్ ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. వైరాలో రాజీవ్‌నగర్, ఇందిరమ్మ కాలనీలను సందర్శించిన ఆమె రిజర్వాయర్‌కు వరద పెరిగితే ముంపు ప్రాంత ప్రజలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలోకి పంపించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వేణు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో త్వరలో ప్రవేశాలు



ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో బ్యాచ్‌కు ఆగస్టు మొదటి వారంలో ప్రవేశాలు మొదలుకానున్నాయి. కాలేజీలో 100 సీట్లకు గాను జాతీయ కోటాకు సంబంధించి 15సీట్లు ఉండగా, వెబ్ ఆప్షన్ల గడువు శనివారం ముగియనుంది. ఈ ఆప్షన్ల ఆధారంగా ఆగస్టు 1వ తేదీ నుంచి జాతీయ కోటా సీట్లు భర్తీ అవుతాయి. ఆపై రాష్ట్ర కోటాలో 85 సీట్ల భర్తీ ప్రక్రియ పది రోజుల్లో ప్రారంభం కానుంది. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ 2023 సెప్టెంబర్‌లో మొదలుకాగా, మొదటి బ్యాచ్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. దీనికి తోడు కళాశాల 30 ఎకరాల్లో విశాలమైన ప్రాంగణంలో ఉండడం, అనుబంధంగా ప్రభుత్వ ఆస్పత్రిలో నిత్యం 1,500 మందికి పైగా ఓపీ నమోదవుతుండడమే కాక విద్యార్థినీ, విద్యార్థులకు సరిపడా హాస్టళ్ల వసతి ఉండడంతో రెండో బ్యాచ్‌లో చేరడానికి ర్యాంకర్లు ఆసక్తి కనబరిచారు. ఇక 2025–26ఏడాదికి కూడా ఉత్తమ ర్యాంకర్లు ఇక్కడ సీట్ల కోసం పోటీపడే అవకాశముందని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు.

యూరియాకు పెరిగిన డిమాండ్

- లక్ష్యం మేర అందుబాటులో లేక రైతుల అగచాట్లు
- వర్షాలతో ఊపందుకున్న పంటల సాగు



తల్లాడ పీఏసీఎస్ వద్ద ఆందోళనతో పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: యూరియాకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పంటల సాగు ఊపందుకుంటోంది. ఈ నేపథ్యాన సబ్సిడీపై విక్రయించే యూరియా కోసం రైతులు పరుగులు తీస్తున్నారు. కానీ లక్ష్యం మేర సరఫరా జరగకపోవడంతో కొరత ఏర్పడింది. జిల్లాలో పంటల సాగు ఆధారంగా సెప్టెంబర్ నాటికి 54,825 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ డిసెంబర్, జనవరి వరకు యూరియా అవసరమవుతుంది. మొత్తంగా వానాకాలం పంటలకు సుమారు లక్ష మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఏప్రిల్ నుంచి జూలై వరకు 15,154 మెట్రిక్ టన్నులకు గాను 11,774 మెట్రిక్ టన్నులు మాత్రమే చేరింది. దీంతో 3,380 మెట్రిక్ టన్నుల యూరియా తక్కువ కాగా సమస్య ఉత్పన్నమవుతోంది. జిల్లాలో అన్ని పంటలు కలిపి 6,08,348 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేస్తే ఇప్పటి వరకు 4,62,346 ఎకరాల్లో సాగయ్యాయి. ప్రధాన పంటలైన వరి 2,87,928 ఎకరాలకు గాను 1,07,334 ఎకరాల్లో, పత్తి 2,15,643 ఎకరాలకు కాగా 2,16,750 ఎకరాల్లో విత్తనాలు నాటారు.

యూరియా కోసం పరుగులు

సమృద్ధిగా వర్షాలు కురుస్తున్న వేళ సాగు చేసిన, సాగయ్యే పంటలకు అవసరమైన యూరియా కోసం రైతులు పరుగులు తీస్తున్నారు. పీఏసీఎస్‌లు తెరవక ముందే బారులు తీరుతున్నారు. కొన్ని సొసైటీలకు యూరియా చేరిందని తెలియగానే పెద్దసంఖ్యలో చేరుతున్నారు. గురువారం చింతకాని సొసైటీ వద్ద చెప్పులు క్యూలో పెట్టగా, తల్లాడలో శుక్రవారం అదే పరిస్థితి ఎదురైంది. వర్షాలతో పంటల సాగు పెరుగుతుండగా సమస్య మరింతగా తీవ్రమవుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యాన రైతుల సాగు భూమి, సహకార సంఘాల్లో స్టాక్ ఆధారంగా ఒక్కో రైతుకు రెండు, మూడు యూరియా బస్తాలే అందిస్తున్నారు. కాగా, ప్రైవేట్ వ్యాపారులు ఇదే అదునుగా రూ.266కు విక్రయించాల్సిన యూరియా బస్తాను రూ.350, అంతకు మించి ధరతో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఏప్రిల్ నుంచి జూలై వరకు యూరియా సరఫరా (మెట్రిక్ టన్నుల్లో)

నెల	ఇండెంట్	సరఫరా
ఏప్రిల్	419	419
మే	2,527	2,527
జూన్	4,708	4,708
జూలై	7,500	4,120
మొత్తం	15,154	11,774

ఎలాంటి ఇబ్బంది లేదు..



జిల్లాలో యూరియా కొరత లేదు. కానీ రైతులు అపోహలతో ముందస్తుగా కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 3,500 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది. నాలుగు రోజుల్లో 3,900 మెట్రిక్ టన్నులు యూరియా రానుంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని రైతులు సరిపడా మాత్రమే కొనుగోలు చేస్తూ.. అవసరం మేరకు వినియోగించాలి.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

హ్యామ్‌పై.. హాయిహాయిగా

- హైబ్రిడ్ విధానంలో రహదారుల అభివృద్ధి
- జిల్లాలో 35రోడ్ల ఎంపిక.. రూ.468 కోట్ల నిధులతో పనులు



నాలుగు లేన్లుగా విస్తరించనున్న ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రోడ్డు

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని పలు రహదారులకు మహర్దశ పట్టనుంది. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యాన జిల్లాకు కేటాయించిన రూ.468.98 కోట్ల నిధులతో 35 ప్రధాన రహదారుల పునర్నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులన్నీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హ్యామ్) విధానంలో జరగనున్నాయి. జిల్లాలోని ముఖ్య పట్టణాలను అనుసంధానించే ప్రధాన రహదారుల ఆధునీకీకరణకు తొలిదశలో ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రధాన మార్గాల అభివృద్ధే లక్ష్యం

ముఖ్య పట్టణాలను కలుపుతూ సింగిల్ లేన్, డబుల్ లేన్‌గా ఉన్న రహదారులను 'హ్యామ్' పథకం ద్వారా అభివృద్ధి చేయనున్నారు. ఇందులో ఖమ్మం – ఇల్లెందు, తల్లాడ – భద్రాచలం, బోనకల్లు – మధిర రోడ్లతో పాటు మధిరలోని రింగ్ రోడ్డు, సత్తుపల్లి – పెంట్లం, కిష్టారం – అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి – దమ్మపేట, బూర్గంపాడు తదితర రహదారులు ఉన్నాయి. ఇందులో డబుల్ లేన్‌గా ఉన్న రహదారులను ఫోర్ లేన్‌గా విస్తరించనుండడంతో ప్రయాణం సాఫీగా సాగనుంది.

382 కి.మీ. మేర రహదారులు

హ్యామ్ పథకంలో భాగంగా జిల్లాలో 382.29 కి.మీ. పొడవున 35 రహదారులు ఆధునికీకరిస్తారు. ఇందుకోసం రూ.468.98 కోట్లు వెచ్చించనున్నారు. ప్రతీ రహదారి వెంట డ్రెయినేజీలు, అవసరమైన చోట బ్రిడ్జిలు నిర్మించడమే కాక మార్గమధ్యలోని జంక్షన్లను సైతం అభివృద్ధి చేస్తారు.

ఏమిటీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్?

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ అనేది ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంలో అమలుచేసే పథకం. ఇందులో ప్రభుత్వం 40 శాతం నిధులను నిర్మాణ దశలో విడతల వారీగా చెల్లిస్తుంది. మిగతా 60 శాతం నిధులు కాంట్రాక్ట్ కంపెనీ భరించాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయ్యాక సదరు సంస్థకు ప్రభుత్వం వడ్డీతో కలిపిన నిధులను 'యాన్యుటీ' రూపంలో చెల్లిస్తుంది. అయితే, రహదారి నిర్మించాక పదిహేనేళ్ల పాటు నిర్వహణ బాధ్యత కూడా సంస్థే చూడాల్సి ఉంటుంది. తద్వారా ప్రభుత్వంపై ఒకే సారి భారం పడకపోగా... రహదారి నిర్మాణం నాణ్యతగా ఉంటుందని భావిస్తున్నారు.

జాబితా రావాల్సి ఉంది..



జిల్లాలో రహదారుల అభివృద్ధి కోసం ప్రతిపాదనలను సమర్పించాం. మొదటి విడతలో కొన్ని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు తెలిసింది. అయితే, ఆ జాబితా అందాల్సి ఉంది. జాబితా రాగానే ప్రభుత్వం ఆదేశాలతో టెండర్ల ప్రక్రియ మొదలవుతుంది. – **యాకూబ్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ**

క్లుప్తంగా

ఆర్‌డీఓ ఆఫీస్‌లో కంప్యూటర్లు జప్తు

ఖమ్మం లీగల్: ఖమ్మంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమి ఇచ్చిన మహిళకు పరిహారం చెల్లింపు విషయమై కోర్టు ఆదేశాలతో ఆర్‌డీఓ కార్యాలయ కంప్యూటర్లను శుక్రవారం జప్తు చేశారు. 1986లో భూమి సేకరించగా గజానికి రూ.400 చొప్పున 2007లో పరిహారం చెల్లించారు. అయితే, ఈ పరిహారం తక్కువగా ఉందంటూ సూరపనేని స్వర్ణ తన భూమి 1,740 గజాలకు పరిహారం పెంచాలని జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈమేరకు గజానికి రూ.2,500 చొప్పున చెల్లించాలని 2021లో తీర్పు ఇవ్వగా, ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ చేసింది. అక్కడ పరిహారం మరింత పెంచుతూ నిర్వాసితురాలికి గజానికి రూ.6వేల చొప్పున చెల్లించాలని ఆదేశించారు. ఇందులో 50 శాతం జమ చేయాలని ఆదేశించి మూడేళ్లు దాటినా స్పందన లేకపోవడంతో ఆర్‌డీఓ కార్యాలయ సామగ్రిని జప్తు చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈమేరకు కోర్టు సిబ్బంది వెళ్లి ఆర్‌డీఓ కార్యాలయంలోని కంప్యూటర్లను జప్తు చేశారు.

అంగన్‌వాడీల బలోపేతానికి చేపడుతున్న చర్యలు ఏమిటి?

ఖమ్మంమయూరిసెంటర్: అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతానికి కేంద్రప్రభుత్వం ఏమేం చర్యలు చేపడుతుందో తెలపాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా శుక్రవారం ఈ అంశంపై ఆయన మాట్లాడారు. దీనికి కేంద్ర మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రిఠాకూర్ సమాధానమిచ్చారు. 2024 నుంచి ఈ ఏడాది జూన్ నాటికి కనీసం 80శాతం పనిదినాలు నిర్వర్తించిన సెంటర్లు తెలంగాణలో 32,551 ఉండగా, 20 శాతం లోపు తెరిచిన సెంటర్లు 386 ఉన్నాయని తెలిపారు. అలాగే, అప్‌గ్రేడ్‌కు తెలంగాణలో 5,008 సెంటర్లు ఎంపిక చేయగా రూ.2.7 కోట్లు మంజూరు చేశామని వివరించారు.

నేటి అథ్లెటిక్స్ ఎంపికలు వాయిదా

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరగాల్సిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను వాయిదా వేసినట్లు జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా వర్షాల నేపథ్యాన ఈ నిర్ణయం తీసుకోగా, ఎంపిక పోటీలు 30వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని క్రీడాకారులు గమనించాలని సూచించారు.

ఇద్దరు బాలకార్మికుల గుర్తింపు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో ఓ దాబా, తిరుమలాయపాలెంలోని వెల్డింగ్ షాపులో బాలకార్మికులతో పనిచేస్తున్నారని ముస్కాన్ బృందం గుర్తించింది. బృందం సభ్యులు, పోలీసులతో కలిసి శుక్రవారం తనిఖీ చేపట్టగా 15ఏళ్ల బాలలతో పనిచేస్తున్నట్లు తేలింది. ఈమేరకు యజమానులు పోట్ల నాగేశ్వరరావు, మాలోతు భద్రుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కల్లూరు డివిజన్‌కు సాగర్ జలాలు


మధిర బ్రాంచ్ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

కల్లూరురూరల్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి పాలేరు జలాశయానికి నీరు చేరగా, ఇటీవల ఎడమ కాల్వ ద్వారా సాగు అవసరాలకు విడుదల చేశారు. రిజర్వాయర్ నుంచి 1,085 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండడంతో ఇన్నాళ్లు కల్లూరు డివిజన్‌కు సీతారామసాగర్ ద్వారా విడుదల చేసిన గోదావరి జలాలను శుక్రవారం నిలిపివేశారు. పాలేరు నుంచి శుక్రవారం సాయంత్రం 600 క్యూసెక్కుల నీరు ఏన్కూరు కెనాల్ 52వ కి.మీ. వద్దకు చేరింది. ప్రస్తుతం కల్లూరు డివిజన్‌లోని కాల్వల్లో అటు కృష్ణా జలాలు 1,085 క్యూసెక్కులు, గోదావరి జలాలు 600 క్యూసెక్కుల మేర ప్రవహిస్తూ శుక్రవారం సాయంత్రం 55 కి.మీ. వరకు 1,200 క్యూసెక్కుల నీరు చేరింది. అలాగే, కప్పలబంధం హెడ్ రెగ్యులేటరీ 77వ కిలోమీటర్ వద్దకు 950 క్యూసెక్కుల నీరు చేరగా మధిర బ్రాంచ్ కెనాల్‌కు.. ఆపై పుణ్యపురం మేజర్, మైనర్ కాల్వలకు, మెయిన్ కెనాల్ ద్వారా పెనుబల్లి, వేంసూరుకు విడుదల చేస్తున్నారు.

ఎందుకనో వెనుకబడ్డాయి..

- స్వచ్ఛ సర్వేక్షన్‌లో పడిపోయిన పురపాలికల ర్యాంకులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో విసిరేసినట్లుగా ఉమ్మడి జిల్లా
- మున్సిపాలిటీలదే కాదు.. కార్పొరేషన్‌దీ అదేతీరు



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: స్వచ్ఛ సర్వేక్షన్ – 2024 ర్యాంకుల్లో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు వెనుకబడ్డాయి. గతంలో మెరుగైన స్థానాల్లో నిలిచిన ఖమ్మం కార్పొరేషన్, ఇల్లెందు మున్సిపాలిటీ ర్యాంకులు ఈసారి దిగజారాయి. మిగతావి ముందంజలో నిలవకపోయినా గతంతో పోలిస్తే ర్యాంకులు స్వల్పంగా మెరుగుపడడం కొంత ఊరట కలిగిస్తోంది. కానీ జాతీయస్థాయి పక్కన పెడితే రాష్ట్రస్థాయి ర్యాంకుల్లోనూ ఉమ్మడి జిల్లా నుంచి ఏ మున్సిపాలిటీకి గౌరవనీయమైన స్థానం దక్కకపోవడం ప్రజలతో పాటు అధికారులను సైతం నిరాశ పరిచింది. ఏదిఏమైనా పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వ్యర్థాల శుద్ధి, తాగునీటి సరఫరా, చెరువుల నిర్వహణ, టాయిలెట్ల శుభ్రత వంటి అంశాలపై శ్రద్ధ కొరవడిందని స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకులు స్పష్టం చేస్తున్నాయి.

పడిపోయిన ర్యాంకులు..

గత కొన్నేళ్లుగా స్వచ్ఛత విషయంలో ఖమ్మం కార్పొరేషన్, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు కొంత మెరుగైన ఫలితాలే సాధించాయి. కానీ, ఈసారి ర్యాంకులు దిగజారడం గమనార్హం. స్వచ్ఛ సర్వేక్షన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఏటా పారిశుద్ధ్యం, పరిశుభ్రత, తాగునీటి నిర్వహణపై వార్షిక సర్వే చేయించి ఫలితాల ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తోంది. ఈసారి తక్కువగా నమోదైన ర్యాంకులు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరును ప్రశ్నించేలా ఉన్నాయి. నిధులు కేటాయించడంతో సరిపెడుతూ వాటిని సమర్థవంతంగా వినియోగించడంలో మాత్రం పాలకవర్గాలు విఫలమయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా వర్షాకాలం నగరాలు, పట్టణాల్లో నీటి నిల్వ, దోమల బెడద, చెత్త కుప్పలు వంటి సమస్యలు పెరుగుతున్న తరుణంలో స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకుల పతనం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ అంశాలను పాలకవర్గాలే కాక అధికారులు పరిగణనలోకి తీసుకుని పట్టణాల పరిశుభ్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ – 2024లో ర్యాంకులు

కార్పొరేషన్ / మున్సిపాలిటీ	రాష్ట్ర ర్యాంకు	జాతీయ ర్యాంకు
ఖమ్మం	60	373
పాల్వంచ	49	302
కొత్తగూడెం	65	396
ఇల్లెందు	93	927
సత్తుపల్లి	95	941
మణుగూరు	103	1,032
మధిర	113	1,108
వైరా	129	1,290

ప్రచారాలతోనే సరి..

ఖమ్మం నగర పాలక సంస్థతో పాటు ఇతర మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రచారం ఊదరగొడుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నా.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఎక్కడ కూడా సేకరించిన దాఖలాలు లేవు. ఇక ఈసారి వంద శాతం చెత్త సేకరించిన మున్సిపాలిటీగా ఒక్కటీ లేదు. ఉమ్మడి జిల్లాలో తడి, పొడి చెత్త సేకరణలో 39 శాతం మార్కులు సాధించి ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలవగా... పబ్లిక్ టాయిలెట్ల శుభ్రతలో కొత్తగూడెం మినహా అన్ని మున్సిపాలిటీలు వెనుకబడినట్లు స్వచ్ఛ సర్వేక్షన్ మార్కుల ద్వారా వెల్లడైంది.

గతంతో పోలిస్తే కిందకు..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు మున్సిపాలిటీల ర్యాంకులు పడిపోవడం గమనార్హం. 2023లో ఖమ్మం మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు రాగా.. ఈ నెల 17న ప్రకటించిన 2024 ఏడాది ర్యాంకుల్లో 60కి పడిపోయింది. జాతీయస్థాయిలో 141 నుంచి 373కు దిగజారింది. ఇల్లెందు మున్సిపాలిటీ రాష్ట్రంలో 21వ ర్యాంకు నుంచి 93వ ర్యాంకుకు పడిపోగా, జాతీయస్థాయిలో 539 నుంచి 927వ ర్యాంకుకు దిగజారింది. ఇక మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీలు మాత్రం అద్భుతమైన ప్రగతి సాధించకపోయినా రాష్ట్ర, జాతీయస్థాయిలో కొంత మెరుగైన ర్యాంకులు సాధించాయి.

ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు


బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం టేకులపల్లిలోని ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు కోర్సు పూర్తికాగానే ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించారు. ఈమేరకు శుక్రవారం ఐటీఐలో తెలంగాణ గేట్‌వే ఫర్ అడాప్టివ్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్(టీ–గేట్)కార్యక్రమం ద్వారా పరిశ్రమల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రైస్ మిల్లులు, గ్రానైట్, షుగర్ ఫ్యాక్టరీలు, చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులే కాక వీవీసీ మోటార్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. పరిశ్రమల శాఖ అధికారులు మోహన్‌బాబు, వెంకన్న, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కృష్ణవేణి, ఉపాధి కల్పన శాఖాధికారి మాధవి సైతం హాజరుకాగా, పరిశ్రమల అవసరాలు, ఐటీఐ పూర్తిచేస్తున్న వారిలో కావాల్సిన నైపుణ్యాలపై చర్చించారు. ఈమేరకు వీవీసీ మోటార్స్ సంస్థ ఈ ఏడాది ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ ట్రేడ్లు పూర్తిచేసే వారికి ఉద్యోగాల కల్పనకు ముందుకొచ్చిందని ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ సహా అధికారులు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి సమావేశం వివరాలు వెల్లడించారు.

పంటలను రక్షించుకోండి ఇలా...

ఖమ్మంవ్యవసాయం: వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యాన పంటల రక్షణలో రైతులు మెళకువలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన చేసిన సూచనలు ఇలా ఉన్నాయి.

- **పత్తి:** పత్తి చేలలో నీరు బయటకు వెళ్లేలా కాల్వలు తవ్వాలి. పైరు అధిక వర్షానికి గురైనప్పుడు పెరుగుదలకు 19:19:19 లేదా 13:0:45 పోషకాలను లీటర్ నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి వర్షం తగ్గాక పిచికారీ చేయాలి. పత్తి మొక్కలు గుంపులు, గుంపులుగా చనిపోతే వేరుకుళ్లు తెగులుగా గుర్తించొచ్చు. దీని నివారణకు ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటర్ నీటికి లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటికి కలిపి మొదలుచుట్టూ వేరు వ్యవస్థ తడిచేలా పోయాలి. అలాగే, పైరు మొదటి 30 – 45 రోజుల్లో రసం పీల్చు పురుగు నివారణకు ఎసిటామిప్రిడ్ రెండు గ్రాములు లేదా థయోమిథాక్సాన్ రెండు గ్రాములను లేదా పిప్రోనిల్ 2 మి.లీ.ను లీటర్ నీటికి పిచికారీ చేయాలి.
- **వరి:** అధిక వర్షాలకు మునిగిన వరినారు మడులు, పొలాల్లో నీరు నిలవకుండా కాల్వల తీసి తొలగించాలి. అధిక వర్షాలు కురుస్తున్న వేళ నత్రజని, పొటాష్ వంటి ఎరువులు వేయొద్దు. వరి నాట్లు కూడా వాయిదా వేసుకోవాలి. వెదజల్లే పద్ధతి అవలంబించే రైతులు కూడా వర్షాలు తగ్గాకే వేసుకోవడం మంచిది. కలుపు మందు, పురుగుమందులను కూడా వానలు తగ్గిన తర్వాతే పిచికారీ చేసుకోవాలి. అలాగే, రైతులు వర్షం కురుస్తున్నప్పుడు చెట్ల కింద ఉండకుండా రక్షిత ప్రాంతాలకు వెళ్లాలని డీఈఏ సూచించారు.

హామీల అమలుకు ఆందోళనలు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఆగస్టు 1నుండి సెప్టెంబర్ 10 వరకు దశలవారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినేపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 1నుండి 20వరకు గ్రామాల్లో ప్రచారం, 21 నుండి సెప్టెంబర్ 4 వరకు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టడమే కాక సెప్టెంబర్ 5న కలెక్టరేట్ ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఆపై సెప్టెంబర్ 10న చలో అసెంబ్లీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలుచేయడమే కాక ఉపాధి కూలీలకు రూ.600 వేతనం చెల్లింపు, వ్యవసాయ కూలీలకు ప్రమాద బీమా, జీవిత బీమా వర్తింపచేయాలనే డిమాండ్‌తో చేపట్టే ఆందోళనలను విజయవంతం చేయాలని వెంకటేశ్వర్లు కోరారు. ఈ సమావేశంలో నాయకులు రేపాకల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, చల్లరాజు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, రెంటాల యాదగిరి, గంట శ్రీనివాసరావు, కూరాకుల నర్సయ్య కేలోత్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కోసం అంబులెన్స్‌లో..!


వృద్ధుడు వచ్చిన అంబులెన్స్

వైరా: కుమార్తె, మనవరాలిని పొలం రిజిస్ట్రేషన్ చేయించాలని నిర్ణయించుకున్న ఓ వృద్ధుడు ఏకంగా అంబులెన్స్‌లో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. వైరా మండలం దాచాపురం గ్రామానికి చెందిన వనమా విశ్వనాథం వైరాలోని పోస్టాఫీస్ సెంటర్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ఈమేరకు తన భార్య పేరిట దాచాపురంలో ఉన్న వ్యవసాయ భూమిని కూతురు మిట్టపల్లి నాగమణి, మనవరాలు శిల్ప పేరిట రిజిస్ట్రేషన్ చేయించేందుకు నిర్ణయించుకోగా, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను వైరా తహసీల్‌కు అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. దీంతో సిబ్బంది అంబులెన్స్‌లోనే విశ్వనాథం వేలిముద్రలు సేకరించి పంపించారు. ఒక్కసారిగా తహసీల్‌కు అంబులెన్స్ రావడంతో అంతా ఆశ్చర్యపోగా, ఆతర్వాత విషయం తెలియడంతో వృద్ధుడిని అభినందించారు.

యూరియా కోసం రైతుల ఆందోళన


యూరియా లారీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

తల్లాడ: తల్లాడ సొసైటీకి శుక్రవారం లారీ లోడ్ యూరియా రావడంతో రైతులంతా ఒకేసారి దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. సొసైటీకి 445 బస్తాల యూరియా వచ్చిందనే సమాచారంతో పరిసర గ్రామాల రైతులు చేరుకున్నారు. అయితే, ఇందులో నుంచి మిట్టపల్లికి 220 బస్తాలు పంపాల్సి ఉందని సొసైటీ చెప్పగా అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లాడ సొసైటీ పరిధిలో 12గ్రామాలు ఉండగా, 225 బస్తాలు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. అందరికీ యూరియా సరఫరా చేయాల్సిందేనని బీజేపీ నాయకుడు ఆపతి వెంకటరామారావు ఆధ్వర్యాన రైతులు నిరసన తెలిపారు. ఈమేరకు ఏడీఏ శ్రీనివాసరెడ్డి ఉన్నతాధికారులతో చర్చించగా తల్లాడ సొసైటీ పరిధి రైతులకు పంపిణీ చేసేలా అంగీకరించారు. అప్పటికే తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్ఐ వెంకటకృష్ణ, ఏఓ తాజుద్దీన్, సీఈఓ నాగబాబు రైతులకు నచ్చచెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది.

యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..


నేలకొండపల్లిలో చెత్త తీయిస్తున్న కార్యదర్శి

నేలకొండపల్లి/బోనకల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంపై 'సాక్షి'లో శుక్రవారం ఇంట్లో ఈగలు.. బయట దోమలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పంచాయతీ అధికారులను మందలించినట్లు తెలిసింది. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయాన పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దని సూచించినట్లు సమాచారం. ఈమేరకు పంచాయతీ అధికారులు ఉదయాన్నే గ్రామాలకు చేరుకున్నారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీతో పాటు బోనకల్ మండలం ముష్టికుంట్లలో వీధుల వెంట చెత్త తీయించడమే కాక డ్రెయినేజీలు శుభ్రం చేయించారు. అంతేకాక దుర్వాసన వెదజల్లుతున్న చోట బ్లీచింగ్ చల్లించారు. ముష్టికుంట్లలో పారిశుద్ధ్య పనులను బోనకల్ ఎంపీడీఓ రమాదేవి పర్యవేక్షించగా, నేలకొండపల్లిలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పరిశీలించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి, భర్త పరిస్థితి విషమం

ఖమ్మంక్రైం: కుటుంబ కలహాలతో ఈనెల 16న ఎలుకల మందు తాగిన దంపతుల్లో భార్య శుక్రవారం మృతి చెందగా, ఆమె భర్త పరిస్థితి విషమంగా ఉంది. ఖమ్మం సారథినగర్‌కు చెందిన సాయితరుణ్ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ అదే ప్రాంతానికి చెందిన ప్రైవేట్ టీచర్ మౌనికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. దంపతుల మధ్య విబేధాలతో అమ్మమ్మ ఇంటికి వెళ్లిన మౌనిక ఎలుకల మందు తాగి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. ఈమేరకు సమాచారం అందుకున్న సాయితరుణ్ కూడా కూడా ఎలుకల మందు తాగాడు. వీరిని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా మౌనిక మృతి చెందింది. అయితే, ఆమె మృతికి భర్త సాయి తరుణ్, అత్తామామలు జయమ్మ, రమేష్ వేధింపులే కారణమని మౌనిక తండ్రి ఫిర్యాదు చేశాడని ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

సైబర్ మోసం కేసులో ముగ్గురి అరెస్ట్

ఖమ్మంక్రైం: చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, మనీలాండరింగ్ చేసినందున డిజిటల్ అరెస్ట్ చేస్తామంటూ రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి రూ.59లక్షలు కాజేసిన ము గ్గురిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్‌చేశారు. ఏపీలోని అనంతపురానికి చెందిన ఝెుద్రిస్వామి, లక్ష్మణ్‌నాయక్, నారాయణరెడ్డి కలిసి గత ఏడాది ఏప్రిల్‌లో రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించారు. వీడియోకాల్ చేస్తూ ఆయన నుంచి విడతల వారీగా రూ.59లక్షలు జమ చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైం పోలీసులు తొలుత స్వామిని, తాజాగా మిగతా ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా సైబర్‌క్రైం ఇన్‌చార్జ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ యాసిన్‌అలీ, ఎస్ఐలు రంజిత్ కుమార్, విజయ్‌కుమార్‌ను సీపీ సునీల్‌దత్ అభినందించారు.

రుణం పేరిట యువకుడికి టోకరా

రఘునాథపాలెం: మండలంలోని కే.వీ.బంజరకు చెందిన యువకుడు తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్ ఆధారంగా యాప్‌లో రుణం కోసం ప్రయత్నించి మోసపోయా డు. అయనకు ఫోన్ గుర్తుతెలియని వ్యక్తులు మెసేజ్ పంపడంతో రుణం కావాలని బదులిచ్చాడు. ఈమేర కు విడతల వారీగా రూ.లక్ష జమ చేయించుకుని ముఖం చాటేయడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. అంతేకాక బాధితుడి సొమ్ములో రూ.60వేలు విత్‌డ్రా కాకుండా అడ్డుకున్నామని వెల్లడించారు.

బిడ్డల పుట్టినరోజు.. తండ్రి మృతి


యాదగిరి (ఫైల్)

కూసుమంచి: కవల బిడ్డల పుట్టినరోజు ఘనంగా నిర్వహించాలని భావించి ఏర్పాట్లలో నిమగ్నమైన తండ్రి అదేరోజు కన్నుమూయడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. కూసుమంచికి చెందిన పుసులూరి యాదగిరి(38) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల పాఠశాలలో ఆయన ఒక్కసారిగా అస్వస్థతకు గురికాగా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్‌గా నిర్ధారించి చికిత్స చేస్తుండగా శుక్రవారం బ్రెయిన్‌డెడ్ కావడంతో మృతి చెందాడు. కాగా, యాదగిరికి ఆరేళ్ల వయస్సు ఉన్న కవల కుమార్తెలు ఉండగా శుక్రవారం వారి పుట్టినరోజు నిర్వహించేందుకు ఆయన ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇంతలోనే యాదగిరి మృతి చెందడంతో భారాబిడ్డలు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

గుర్తుతెలియని వ్యక్తి..

మధిర: మధిర రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మృతుడు 'కారు గుర్తుకే ఓటు వేద్దాం, కందాలను గెలిపించుకుందాం' నినాదం కలిగిన టీ షర్ట్ ధరించి ఉండగా ఇతర ఆధారాలేవీ లభించలేదని పేర్కొన్నారు. ఆయన ఎడమ మోకాలి నుంచి పాదం వరకు తెల్లటి బ్యాండేజ్ చుట్టి ఉందని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98481 14202, 99636 41484 నంబర్లకు సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ సూచించారు.

లైసెన్స్ లేకుండా తుపాకుల వినియోగం

కల్లూరు: కల్లూరు మండలం తాళ్లూరు వెంకటాపురానికి చెందిన అనుమతి లేకుండా నాటు తుపాకులు వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గ్రామానికి చెందిన ఘంటసాల లక్ష్మీనారాయణ, ఘంటసాల పెద్దిరాజు చెరువు వద్ద కాపలా ఉంటుండగా, ఆయుధ లైసెన్స్ లేకుండానే నాటు తుపాకులు, గన్ పౌడర్ ఉపయోగిస్తున్నట్లు తేలింది. దీంతో వీరిద్దరిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు.

రింగ్ సెంటర్‌లో లారీ బీభత్సం


ప్రమాదంలో ధ్వంసమైన ద్విచక్రవాహనాలు

పెనుబల్లి: మండలంలోని వీఎం.బంజర్ రింగ్ సెంటర్ మీదుగా వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో వాహనం అదుపు తప్పింది. సత్తుపల్లి వైపు నుంచి బొగ్గు లోడ్‌తో శుక్రవారం ఖమ్మం వైపు లారీ వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంతో రింగ్ సెంటర్ వద్ద అదుపుతప్పి బస్టాండ్ కాంప్లెక్స్ ఎదుట ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. ఆ సమయాన ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పగా ఐదు వాహనాలు దెబ్బతిన్నాయి. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌వైర్ చోరీ

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను కింద పడేసి అందులో నుంచి కాపర్ వైరు, ఆయిల్ చోరీ చేశారు. ఈమేరకు ఏఈ సతీష్ ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

ఎడతెరిపిలేని వర్షం


తిరుమలాయపాలెం: అలుగు పోస్తున్న జూపెడ చెరువు


కామేపల్లి: ముచ్చర్లలో ఓ ఇంట్లోకి చేరిన నీటిని ఎత్తిపోస్తున్న మహిళ


ఖమ్మం మయూరిసెంటర్: కేఎంసీ డీజిల్ రూమ్‌లో కారుతున్న నీరు

తిరుమలాయపాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి చేన్లలోకి నీరు చేరింది. తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు పెద్ద చెరువు, జూపెడ పెద్ద చెరువు, మూడుముక్కల కుంట, బచ్చోడు ఏనుగుల చెరువుల్లో సామర్థ్యానికి మించి నీరు చేరడంతో అలుగు పోస్తున్నాయి. గతంలో భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా చెరువులకు నీరు చేరగా, ఇప్పుడు వర్షాలతో వరద రావడంతో మిగతా చెరువులు కూడా అలుగు దశకు చేరుకున్నాయి. కాగా, పత్తి చేన్లలో నీరు నిలిచి కలుపు పెరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- **కామేపల్లి:** మండల వ్యాప్తంగా శుక్రవారం కూడా వర్షం కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి కామేపల్లి పెద్ద చెరువు జలకళ సంతరించుకుని మత్తడి పోస్తోంది. మిగతా చెరువులు, కుంటల్లోకి సైతం నీరు చేరింది. ముచ్చర్ల గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.
- **ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని డీజిల్ రూమ్(పారిశుద్ధ్య విభాగం) లో జలధార ఆగడం లేదు. కార్యాలయం 'బీ' బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఈ గదిలో ఓ మూలగా కొన్ని నెలలుగా నీరు కారుతూనే ఉంది. తాజా వర్షంతో ధార మరింత పెరగగా.. సీలింగ్, స్లాబ్ కొద్దికొద్దిగా దెబ్బతింటున్నాయి.